# కథలకు రాజు – మునిపల్లెరాజు

## కొట్టి రామారావు

*మానవేతిహాసానికి మొదటి పంక్తి*
*మరణవాంగ్మూలానికి చివరి పంక్తి!*
*ఒక శిశువు ప్రధమశ్వాస!*
*ఒక జనని అంత్యప్రాస!!*

సాధారణంగా అందరికీ తెలిసిన మునిపల్లె రాజుగారు గొప్ప కథకుడు. కానీ పై పంక్తులు చూడండి. ఆయన చాలా గొప్ప కవి కూడా. నాలుగు గొప్ప కథల సంపుటులతో పాటు రెండు కవితా సంకలనాలు 1.వేరొక ఆకాశం - వేరెన్నోనక్షత్రాలు 2.అలసిపోయినవాడి అరణ్యకాలు ప్రచురించారు. పైపంక్తులు వారి కవితా సంపుటిలోవే!



మునిపల్లె రాజుగారికి కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం (2005 సంవత్సరానికి) ‘అస్తిత్వనదం ఆవలి తీరాన‘ అనే కథల సంపుటికి వచ్చిందన్నవార్త చదివి రాజుగారికి ఫోను చేశాను. చేసి "ప్రతి సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార వార్తల్లో మీ పేరులేదని తెలిసి గుండె కలుక్కుమనేది. ఇంతకాలానికి మీ కథలకు పురస్కారమిచ్చి కేంద్రసాహిత్య అకాడమీ తన గౌరవాన్ని ఇనుమడింప జేసుకున్నది"అన్నాను. దానికాయన సాధారణ స్థాయిలో ధన్యవాదాలు చెప్పి "మూడు నాలుగు సార్లు సాహిత్య అకాడమీ నా పేరు ప్రతిపాదనను పరిశీలించిందని వింటూ వచ్చేను. ఇప్పటికిచ్చినా నేనేమీ బాధపడలేదు. మీలాంటి అభిమానుల గుండెల్లో నేనుండగలగడమే నా అదృష్టంగా భావిస్తాను. ఇదే నాకు గొప్ప పురస్కారం!" అన్నారు రాజుగారు!

ఆయన మాటల్లాగానే జీవితమూ చాలా విశిష్టమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక మంది ప్రముఖ రచయితలు, సాహిత్యవిమర్శకులు ఆయనను అనేక దశాబ్దాలకు ముందే ప్రశంసలతో ముంచెత్తారు. మచ్చుకు "మాస్టర్ పెయింటర్ కుంచె స్పర్శలాంటి శైలిలో చిత్రించిన వర్ణ చిత్రాలు మునిపల్లెరాజు కథలు" అన్నారు వాకాటి పాండురంగారావు.

"హృదయమున్న మార్క్సిస్టు. జీవితం తెలిసిన సైంటిస్టు. అన్నింటినీ రంగరించగల ఆల్కెమిస్టు" అన్నారు డా.పోరంకి దక్షిణామూర్తి.

"మునిపల్లె రాజుగారి కథలు కస్తూరి మాత్రలు. రసగుళికలు" పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారన్నారు.

"చలం తర్వాత రాజుగారే" అని కథా నిలయం నిర్మాత కాళీపట్నం రామారావుగారన్నారు.

"మునిపల్లె రాజు కథల్లో చాలా వాక్యాల్లో కవిత్వం మాత్రమే కాదు, దాని ఆసరాగా అతడు మాత్రమే వింటున్న ఆ రహస్యనాదమేదో మనం కూడా వినగలుగుతాం. కథకుడు యువకుడిగా ఉన్నప్పుడు ఆకలిని చూశాడు, అదినిజమైన ఆకలే! అతడు నేరుగా ఆర్థిక మాంద్యానికే పుట్టినబిడ్డ. యుద్ధాన్ని చూశాడు. యుద్ధమంటే ప్రతీకాత్మక యుద్ధంకాదు. నిజం యుద్ధమే. సరిహద్దుల్లో, రణరంగాల్లో సైనికుడై సంచరించాడు. వార్తాకథనానికీ, కథనానికీ సరిహద్దులు చెరిగిపోయిన కాలంలో నిజమైన కథనమెట్లా ఉంటుందో మనకోసం ఉదాహరణగా చూపడానికే మునిపల్లె రాజు కథతో తపస్సు సాగిస్తున్నారు. ఆ విశిష్ట కథకుడికి, ఆ సత్య శోధకుడికి బహుమతినివ్వడం ద్వారా సాహిత్య అకాడెమీ తన గౌరవాన్ని ఇనుమడింపజేసుకున్నది" చిన వీరభద్రుడు.

కేంద్రసాహిత్య అకాడమీ రాజుగారి కథా సంపుటి "అస్తిత్వనదం ఆవలితీరం" అన్నదానికి పురస్కారం ఇప్పుడు ప్రకటించింది. నిజానికి పుస్తకానికే మచిలీపట్నంలోని ఆంధ్ర సారస్వతసమితి 2003 లోనే మునిపల్లె రాజుగారికి ఆంధ్రదేశపు ఉత్తమ కథకునిగా ఎంపిక చేసి నగదు పురస్కారంతో సత్కరించింది. రాజుగారికి ఆంధ్ర దేశంలో అనేకపురస్కారాలు లభించేయి. వారి పుస్తకాల మీద ఎందరో ఎమ్.ఫిల్, పి.హెచ్.డీలు చేశారు.

సాహిత్య అకాడమీ పురస్కార ప్రకటన తర్వాత ఈ వ్యాసకర్త జీసనారాతో కలిసి హైదరాబాదులో సైనిక్‌పురిలో ఉన్న వారి నివాసంలో కలిసి దాదాపు రెండుగంటలు గడిపే అదృష్టం కలిగింది. రెండు గంటలు కథా చర్చతోటి సాహిత్య చర్చతోటీ గడపడం జరిగింది. ఆ సందర్భంలో తెలిసిన విషయాలు: రాజుగారికి తెలుగు, భారతీయ సాహిత్యంలోనే కాదు. ఆంగ్లేయ సాహిత్యం, ఫ్రెంచి, జర్మన్, రష్యన్ కవులు - వారి పొయిట్రీ, కథలు, నవలలు, నాటకాలు - ఇత్యాది అన్ని సాహిత్య ప్రక్రియలలోను పరిచయమున్నది. తెలుగు, ఇంగ్లీషు, హిందీ సంస్కృతం - భాషల్తో పరిచయమే కాదు, వాటిలో కవిత్వం చెప్పగల సామర్థ్యమున్నది. ముఖ్యంగా తెలుగు ఇంగ్లీషు భాషల్లో ఆయన భాషా సంపద అనితర సాధ్యం. ఒక ప్రక్క సైన్యంలో పనిచేస్తూ ఇన్ని గొప్ప రచనలు చేయగలగడం - అదీ అత్యంత ప్రతిభావంతమైన భాషా పటిమను ప్రదర్శించడం - విన్నప్పుడు - ఆయన ముఖతా తెలుసుకున్నప్పుడు మా ఇద్దరికీ ఎంత ఆశ్చర్యం కలిగిందో చెప్పలేము. ఎక్కడా మాటల్లో కానీ, ప్రవర్తనలోకానీ ఆడంబరంలేదు. ఎదుటివాడు ఎంత పెద్ద పండితుడైనా, చిన్న రచయిత అయినా అదే సింప్లిసిటీ, అదే సిన్సియారిటీ, అదే నిబద్ధత! సైనిక్‌పురిలో దిగి ఆయన నివాసం కనుక్కోవడం కష్టమైంది, మాకు. ఫోన్ చేశాం. అంత పెద్దతనంలోనూ (ఆయన వయస్సు 82) దాదాపు అరకిలోమీటరు నడుచుకుంటూ వచ్చి మమ్మల్ని వారింటికి తీసుకుని వెళ్ళారు. తిరిగి వచ్చేటప్పుడు, 'చీకటి పడింది మేము మేము వెళ్ళగలం' అని చెప్పినా, మమ్మల్ని బస్‌స్టాప్ వరకూ స్వయంగా పంపించి కానీ ఆయన వెళ్ళలేదు.

రాజుగారు కథా కథనంలో కవిత్వంలో శిఖరాగ్రాన ఉన్నా ఆయన్ను కలిసిన చిన్న కవులకూ, రచయితలకూ అవ్యాజ ప్రేమాభిమానాలందించడంతో ముందుంటారు. ఎంత చిన్నవాడు పలకరించినా తనకన్నా గొప్పవాడు పలకరించాడన్న గౌరవంతో ప్రతిస్పందించే గొప్ప వినయ సంపన్నుడు రాజుగారు.

ఈమధ్యనే రాజుగారు 'జర్నలిజంలో సృజనరాగాలు' అనే వ్యాస సంపుటిని ప్రచురించారు. ఈ పుస్తకం నాకు ఒకరోజున పోస్టులో వచ్చింది. లోపలికి తొంగి చూస్తే ఆశ్చర్యంతోపాటు ఆనందమూ కలిగింది. పుస్తకంలో "వివిధ కవుల, రచయితల పుస్తకాలకు ఆయన రాసిన 'ముందుమాట'లు, ప్రముఖ కవులూ పండితులూ ఆయన గురించి వ్రాసిన ఆప్తవాక్యాలు, పరామర్శలూ, అశ్రుతర్పణలూ ఉన్నాయి. ఈ వ్యాసకర్త కథాసంకలనం 'రెక్క తెగిన చైతన్యం'కు రాజుగారు రాసిన 'కవితాకాశం నుండీ కథా మైదానానికి ప్రస్థానం' అనే యోగ్యతాపత్రమూ ఆ 'సృజనరాగాల'లో చోటుచేసుకున్నది. ఆయన వ్రాసిన ముందు మాటలో ఎంత ఆప్యాయత, ప్రోత్సాహం ఉన్నదో మచ్చుకు కొన్ని వాక్యాలు!

"స్నేహ పారిజాతంగా తోచే భావకుడు, సాహిత్య వీధుల్లో సాధుపధికుడు అయిన రచయిత - కవిత్వం నుండీ కథాప్రక్రియను స్వీకరించి పయనం చేయుటమంటే - జీవితానికీ, వాఙ్మయానికీ గల అవినాభావాన్ని గ్రహించినట్లే!జనన కల్లోలాలు, త్రివిధ తాపత్రయాలు (ఆధ్యాత్మిక భౌతిక, నైతిక, ఆర్థిక విషమ సమస్యలు) తను మనుగడ సాగిస్తున్న సమాజాన్ని అల్లకల్లోలం చేస్తున్న తరుణంలో ఈ పరిణామం జరుగుతుంది. రచయిత ఆలోచనాధోరణిలో! అందుకే రామారావుగారి కథల్లో గోర్కీ మహాశయుడు చెప్పిన Joy of life and the force of pity. రెండూ ప్రక్క ప్రక్కనే నడిచాయని నేననుకుంటాను" ఎంతటి ఔన్నత్య శిఖరం రాజుగారు! మరెంతటి ఔదార్యత!!

'జర్నలిజంలో సృజనరాగాలు' పుస్తకంలోని దాదాపు 80 మంది పుస్తకాలకు (కవితా, కథావ్యాస సంకలనాలు) ముందు

మాటలు - బహుపసందుగా - వారిలో ఏమాత్రం ప్రతిభ ఉన్నా ప్రోత్సహిస్తూ - ముందుకు - మరింత ముందుకు నడిపిస్తూ - నిష్కల్మష హృదయంతో - వారి కవిత్వాన్ని, రచనను - ఆవిష్కరించారు. ఇది లోకంలో చాలా అరుదుగా జరిగే సంఘటన అనడంలో సందేహం లేదు.

అయిదు దశాబ్దాలకు పైగా రాజుగారు కథా పయనం సాగిస్తున్నారు. కథా రచయితగా ఆయనకో ప్రత్యేకత ఉంది. "పైకి కథలు రాస్తున్నట్టుగా కన్పిస్తున్నా ఆ కథల వెనుక తీవ్రాతి తీవ్రమైన నిర్విరామమైన అన్వేషణ ఉంది... ఈ అన్వేషణ ఒక అభివ్యక్తి కోసం, శిల్పం కోసం, భాష కోసం కూడా... నేటి కాలపు కథకుడు చూస్తున్నదీ, మనకు చూపగలుగుతున్నదీ దృశ్యాన్నిమాత్రమే.. కానీ రాజుగారు ఆ దృశ్యం వెనుక అదృశ్యం గురించీ మనకు చూపించగలరు" (చిన వీరభద్రుడు)

"కథకుడి స్వగతాలు"లో రాజుగారిలా అన్నారు.

"కొన్ని జ్ఞాపకాలకు శక్తివంతమైన వ్యక్తిత్వం ఉంటుంది. అది సెన్సిటివ్ మనిషికి పగటిపూటి నీడలు, రాత్రిపూట పీడకలలు. దుఃఖం మానవుణ్ణి అంతర్ముఖుడ్ని చేస్తుంది. నరులకు తమ దుఃఖాలే గురువులు" రాజు గారు అంతర్ముఖుడవ్వడంలో ఆశ్చర్యమేముంది?

"తను స్వయంగా జీవన గతిలో దుఃఖాను భూతిని పొందినా ఇతరుల దుఃఖంతో తను పాలుపంచుకున్నా - రచయితకు విలువైన భావనాస్ఫూర్తి ఉదయిస్తుంది. సర్వమానవ ప్రేమకు అప్పుడే రచయిత వైతాళికుడౌతాడు. కులం మతం, ద్వేషం అతన్ని అంటవు. సత్యాన్ని సత్యంగానే దర్శిస్తాడు. నిర్భీతిలో రచిస్తాడు. వేదనాపూరితమైన లోకాన్ని, ఆధ్యాత్మిక భౌతిక కల్లోలాన్ని దార్శనికుడిగా విశ్లేషించి, తన పరిసరాల్ని క్షాళితం చేయాలనే సంకల్పంతో ఉద్యమిస్తాడు. అప్పుడు వ్యక్తమయ్యేదే తొలి రచన ఈ వాక్యాల్లో అనిపించుకుంటుంది. తత్పూర్వం వచ్చినవి వ్రాతలు మాత్రమే! మునిపల్లె రాజుగారి కథా తపస్సు వెనుక ఎంతటి సత్యాన్వేషణ దార్శనికత దాగి ఉన్నదో మనకు అర్థమవుతుంది.

మునిపల్లె రాజు కథా సంకలనాలు:-

1.మునిపల్లె రాజు కథలు
2.పుష్పాలు, ప్రేమికులు, పశువులు
3.దివోస్వప్నాలతో ముఖాముఖి.
4.అస్తిత్వనదం ఆవలితీరాన - మేజికల్ రియలిజం కథలు

ఈ నాలుగవ కథా సంకలనమే రాజుగారికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది.

మేజికల్ రియలిజం అంటే ఏమిటి? రాజుగారి మాటలులోనే "బహుశః గడిచిపోయిన శతాబ్దాల్లో ఎందరో మానవులు మౌలికమైన కొన్ని అస్పష్ట ప్రశ్నలు వేసుకుని ఉంటారు. అవి భౌతిక అస్తిత్వ ఆధ్యాత్మికమైనవి. ఎవరెవరికి ఏ సమాధానాలు లభించాయో! "యుగధర్మం మారినప్పుడల్లా జీవితపు చిరమర్మవేదనలు వేర్వేరు పరిభాషాపదాల్తో ఆ ప్రశ్నలనే పునః పునః లేవనెత్తుతుంటాయి. భారతీయ తాత్వికలోకంలో (1) ఆధ్యాత్మిక దుఃఖం (2) ఆధి భౌతిక దుఃఖం (3) ఆధి దైహిక దుఃఖం - అని మూడు రకాలుగా వర్గీకరించబడ్డాయి. ఈ దుఃఖాలు ప్రశాంత మానవ జీవన సరళిని అల్లకల్లోలం చేసి, మారణ హోమాన్ని సృష్టించిన దుష్ట రాక్షస శక్తులు విజృంభించిన తరుణంలో ప్రతి యుగంలోనూ ప్రప్రథమ నిస్సహాయ స్థితి ఆవరించినప్పుడల్లా ఈ సంక్లిష్ట ప్రశ్నావళి కూడా మానవ జాతిని వేధించేవే. మళ్ళీ మానవుడు తన సృజనాత్మక శక్తుల్ని కూడదీసుకుని ఈ అధర్మ విధర్మాల్ని నిర్మూలించినదాకా ఒక సంధియుగం తాకుంటే - ఆ సంధ్యాకాశంలో మనిషిని వేదనకు గురి చేసే అనుమానాలే ఈ ప్రశ్నలు.

ఈ సంపుటిలోని కొన్ని కథలు నా అదృశ్య పృచ్ఛకుడి ప్రశ్నలకు సమాధానాలుగా వెలువడ్డవే అని నా విశ్వాసం. నేటి మానవుడి చైతన్యానికి రెండు పార్శ్వాలయిన సామాజిక స్పృహ, జీవన స్పృహ - అతని సుదీర్ఘవికల స్వప్న జీవిత నిశిలో అంతర్ వ్యోమయానం చేస్తూనే ఉంటాయి. ఆ పరిభ్రమణుల రహస్య ప్రకంపనలను అభివ్యక్తీకరించే ప్రయత్నమే ఈ "మాజికల్ రియలిజం"!... భౌతిక దృష్టికి గోచరించే వాస్తవాల వెనుక దాగిఉన్న అతిలోక వాస్తవాల్ని వెలికి తీసే సాధనే మాజికల్ రియలిజం లేక అద్భుత వాస్తవికత. ఒకానొక

మాయావాదఛాయావాద పదశైలీ నిర్మాణంలోనే దాని సహజ స్వరూపం గోచరిస్తుంది. అది శుష్క నినాదాల సాహిత్య మార్గాలను అనుకరించదు!

"గేబ్రియల్ గార్షియా, మార్క్వెజ్ వంటి ప్రసిద్ధ లాటిన్ అమెరికన్ రచయితల సృష్టి - మాజికల్ రియలిజం అని పాశ్చాత్య సాహితీకారులంటారు. ఈ ప్రక్రియ వ్యాప్తి కావడానికి ఆయా దేశాల ప్రత్యేక రాజకీయ వ్యవస్థల నిరంకుశ ధోరణులే కారణం. నిరంకుశాన్ని అన్యాపదేశంగా ఎదుర్కొనే సాహిత్య ధోరణిగా అక్కడి రచయితలకు మాజిక్ రియలిజం తోడ్పడింది.

"కానీ భారతీయ జానపద వాఙ్మయంలోనూ, రామాయణ, మహాభారత, భాగవత పురాణాల్లోనూ దర్శనమిచ్చేది ఈ అద్భుత మాయావాదమే. దీన్ని అనితర సాధ్యంగా నిర్వహించిన ఆద్యుడు వ్యాసమహర్షి. మాజికల్ రియలిజమ్ సృష్టికర్త వ్యాసులవారిని స్మరించుకుంటూ, ఆధునికం క్లిష్ట జీవన సమస్యల పరిధిలో యిముడుస్తూ ఈ కథా రచన సాగిందని మనవి చేసుకుంటున్నాను"

రాజుగారి దేశ విదేశాల సాహిత్య సాధనతో పాటు ఆయన వ్యక్తిగత పరిశోధనాత్మక విశ్లేషణ, సృజనా వైశిష్ట్యం ఎంత గొప్పదో మనకు ఈ పురస్కారంతో అయినా అర్థమయితే తెలుగు సాహిత్యానికి మంచి రోజులు వచ్చినట్లే. ఈ "అస్తిత్వనదం ఆవలితీరాన" అనే పుస్తకాన్ని హిందీలోకి అనువదిస్తే 'జ్ఞానపీఠ్' అవార్డు, ఇంగ్లీషు లోకి (ఆయనే) అనువదిస్తే నోబుల్ ప్రైజ్ తప్పక వస్తాయనే నా నమ్మకంతో పాటు మీరు శృతికలుపుతారని ఆశిస్తాను!



ఇలా అన్నారు

*మీ ఇంటి సంగతి ఇంకోరికి తెలుసు. వాళ్ళ ఇంటి సంగతి మీకు తెలుసు. వాళ్ళకి తెలుసునని మీకూ తెలుసు. మీకు తెలుసునని వాళ్ళకీ తెలుసు. వొకరిది వొకరి తెలీనట్టుగా నటించాలి, లోపల ఇంకోళ్ళకి తెలీకుండ ఎంత కుళ్ళిపోయినా సరే, పైకి మర్యాదస్తులవలె కనపడాలి. ఇదే జీవనానికి మూలసూత్రం.*

*శివం నాటిక (1922)లో చలం*

*జీవితం నెత్తిమీద కొట్టి కళ్ళు తెరిచినప్పుడు వెతుకుతారు సొల్యూషన్స్ కోసం. కానీ కొందరు కళ్ళు తెరవక అట్లానే అణగారిపోతారు.*

*మనం చేసే కార్యాలు మనస్ఫూర్తిగా చెయ్యం. ఇష్టం లేనివి యెన్నో చెయ్యవలసి వస్తుంది. అందువల్లనే జీవితం ఇంత రసహీనంగా వుంటుంది.*

*ప్రేమలేఖలు(1921-27) లో చలం*